క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరుని ఆలయంలో రుద్ర హోమం



రుద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాస శివ రాత్రి సందర్భంగా ఆదివారం రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 24 మంది దంపతులు, రాత్రి 7 గంటలకు స్వామివారికి నిర్వహించిన ముత్యాల పూజ, లీలా కల్యాణంలో 42 మంది దంపతులు పాల్గొన్నారు. హోమం, పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10:30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని దివ్యాంగుల జాతీయ హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాడి నటరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల సమావేశం పి.రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌లో అనేక ఇబ్బందులు వస్తున్నాయని, అర్హులకు కూడా పెన్షన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులకు పెన్షన్ల మంజూరులో నిబంధనలను సడలించాలని ప్రభుత్వాన్ని కోరారు. మద్దాల శ్రీనివాస్, ఎం.వైకుంఠం, ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఉండి: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్నార్పీ అగ్రహారం చర్చి ఎదురుగా జాతీయ రహదారిపై ఈ నెల 8వ తేదీ రాత్రి ఐక సెలయ్య (80) అనే వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతనిని చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 9వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఆదివారం వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు.

జూదరుల అరెస్ట్

భీమవరం: టూటౌన్ ప్రాంతంలో జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ గుత్తుల శ్రీనివాస్ ఆదివారం చెప్పారు. నిందితుల నుంచి రూ.16,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నందీశ్వరుడికి అభిషేకాలు

ఆకివీడు: కార్తీక త్రయోదశి సందర్భంగా స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి ఆదివారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వయంగా అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. మల్లేశ్వరుడికి పంచహారతులు అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, దేవస్థానం చైర్మన్ గునుకుల కొండయ్య, బెజవాడ మహేష్ నాగేంద్రకుమార్, బాలు, నక్కా శ్రీను, డీ.వాణీ, రేవతి పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని వైఎస్సార్ సీపీ నాయకుడు గ్రంధి రవితేజ అన్నారు. పంచారామ క్షేత్రాలలో ఒకటైన భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం సందర్భంగా వచ్చే భక్తులకు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, ఆలయ ఈవో రామకృష్ణంరాజు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, తాణాల రామకృష్ణ, నల్లం రఘు, లీల, నందమూరి అంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సాంకేతిక సందడి

- సాంకేతిక బోధనపై విద్యార్థుల ఆసక్తి
- అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ బోర్డులు



కాపులకొడప ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోర్డుపై పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక సందడి నెలకొంది. గతంలో కేవలం బ్లాక్‌బోర్డుపై మాత్రమే పాఠాలకు అలవాటు పడిన పిల్లలకు పెరుగుతున్న సాంకేతిక ప్రపంచంలో కొత్త తరహా బోధనను ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ అనేది ప్రతి ఒక్కరి ఇంట్లో ఉంటుంది. అలాగే యూట్యూబ్ వంటి సైట్స్ అందరికీ తెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో ప్రత్యేకంగా డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే బడి పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. మధ్యాహ్న భోజనం, విద్యాసామగ్రితో పాటు, దుస్తులు విద్యార్థులకు సకాలంతో అందుతున్నాయి. ప్రతీ ఏటా అమ్మ ఒడి పథకం కింద డబ్బులు తల్లుల ఖాతాల్లో జమవుతున్నాయి. ఇప్పటికే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్స్‌తో విద్యాబోధన జరుగుతుంది.

ప్రత్యేక పరికరాల ఏర్పాటు

ఇప్పటివరకూ అన్ని పాఠశాలల్లో ఉన్న బ్లాక్ బోర్డు, చాక్ పీస్‌ల స్థానంలో నాడు–నేడు పథకంలో భాగంగా తొలుత గ్రీన్‌బోర్డును, తదనంతరం డిజిటలైజేషన్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీలు) ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఐపీఎఫ్ స్క్రీన్లతో బోధన జరిపేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులకు కూడా శిక్షణను అందించారు. ఇదే తరహాలో ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను అందించారు. వీటి ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా పాఠశాల విద్య ప్రథమ స్థానంలోకి చేరడంతో పాటు డిజిటల్ బోధనలో మంచి ఫలితాలను కూడా అందిస్తుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు డిజిటల్ విద్యపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

బోధనలో మార్పు బాగుంది



ఇప్పటివరకూ ప్రభుత్వ బడిలోనే చదువుతూ వచ్చాను. ఈ ఏడాది డిజిటల్ స్క్రీన్‌పై పాఠాలను చెబుతున్న తీరు చాలా బాగుంది. నేను, మా ఫ్రెండ్స్ అంతా ఏ గ్రేడులో పాస్ అయ్యేందుకు ఈ బోధన ఎంతగానో దోహదపడుతుందని అనుకుంటున్నాను. స్కూల్లోనే అన్ని సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

– ఒడుగు మహాలక్ష్మి, పదో తరగతి విద్యార్థిని

పాఠాలన్నీ అర్థమవుతున్నాయి



డిజిటల్ బోర్డుమీద చెబుతున్న పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. అన్ని సబ్జెక్టులు మాస్టార్లు కూడా కేవలం చెప్పడమే కాకుండా అర్థమయ్యే విధంగా చూపించడం చాలా బావుంది. ఇలా ఎప్పుడూ పాఠాలు వినలేదు. లెక్కలు, సైన్స్, సోషల్ అన్ని సబ్జెక్టులు మా అందరికీ బాగా అర్థం అవుతున్నాయి.

– గన్నాబత్తుల లక్ష్మీకల్యాణ్, పదో తరగతి విద్యార్థి

వృద్ధులకు నిత్యావసరాల అందజేత



వృద్ధులకు నిత్యావసరాలు సరుకులు, రగ్గులు పంపిణీ చేస్తున్న హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని నాలుగు నిరుపేద కుటుంబాలకు గడచిన మూడేళ్లుగా హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ప్రతి నెలా నెలకు సరిపడ నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. వారి సేవలకు స్పందించిన పాలకొల్లు ఆదిత్య కళాశాల లెక్చరర్ జ్ఞానమోహన్ అతని స్నేహితుడు కె.రామానుజం (చెన్నై) ఈ నెల రూ.12 వేలు ఇచ్చారు. ఈ నగదుతో ఆ నాలుగు పేద కుటుంబాలతోపాటు మరి కొంత మందికి ఆదివారం రగ్గులు, దుప్పట్లు, చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ముద్దల రాధాకృష్ణ, దాత జ్ఞానమోహన్, ప్రోత్సాహకులు అడబాల సతీష్, డేగల వెంకటేశ్వరరావు, ముద్దల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ శాంతి ధాంలో ప్రత్యేక పూజలు



దక్షిణావృత శాంఖాలతో తీర్చిదిద్దిన శివలింగం

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతి ధాంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 108 దక్షిణావృత శంఖాలతో శివలింగాన్ని వాసవీ మాత పంచలోహ విగ్రహం ఎదుట తీర్చిదిద్దారు. అనంతరం 160 మంది దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు కనుల పండువగా నిర్వహించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందు కు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీకమాసం కావడంతో పేరుపాలెం బీచ్‌కు వెళ్లే సందర్శకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కంటి వైద్యం కోసం ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యం నిమిత్తం ఓ బాధితునికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఉదయం స్థానిక కుళాయి చెరువు గట్టు వద్ద వాకర్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు బాధితుడు బొడ్డు సముద్రుడుకు నగదు అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ పట్టణంలోని ఓ కిరాణా షాపులో పనిచేస్తున్న సముద్రుడుకు కంటి వైద్యం నిమిత్తం నగదు అవసరమని కొందరు సహచరులు తెలపడంతో బాధితుడికి నగదు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, సలాది రామచంద్రరావు, జగ్గురోతు రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా కుంతీ లక్ష్మీనరసింహుని మాస కల్యాణం



కుంతీ లక్ష్మీనరసింహస్వామి మాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఆదివారం దేవేరులకు మాస కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో పాలమూరు మాధవాచార్యులు ఈ కల్యాణం జరిపించారు. వీరవాసరానికి చెందిన కానూరి రాజేష్‌కుమార్, పద్మజ దంపతులు ఈ కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి కల్యాణం తిలకించారు.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం



మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు



మల్లిపూడిలో మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం శివలింగానికి హారతిపడుతున్న వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు

పెనుమంట్ర: మానవసేవే–మాధవసేవ అనే బాబా సూక్తులను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర వేద అధ్యయనం విభాగం వేద పండితుడు డాక్టర్ కొఠారు సాయి ప్రసాద్‌శర్మ అన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రపంచ శాంతి లోక కల్యాణార్థం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేద అధ్యయన విభాగం సహకారంతో ఆదివారం మల్లిపూడి గ్రామంలో శ్రీమదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ముందుగా సాయి మందిరం నుంచి మంగళవాయిద్యాలతో వేద పఠనంతో కోలాట భజనలతో శోభాయాత్రను గ్రామంలో నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో గోపూజ, పతాక ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించి, వేదికపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి, సాంస్కృతిక కూచిపూడి నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన సత్యసాయి సేవా ప్రతినిధులతో పాటు బెంగుళూరు, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కన్వీనర్ గుడిమెట్ల శ్రీరామారెడ్డి కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుడిమెట్ల బాలగంగాధర్ రరెడ్డి, దండు రామరాజు, గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి, గుడిమెట్ల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా కార్తీక వనసమారాధనలు



పాలకొల్లు సెంట్రల్: కాపు వనసమారాధనలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు

పాలకొల్లు సెంట్రల్: వనసమారాధనలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం కార్తీకమాసం పురస్కరించుకుని పట్టణంలో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. కార్తీకమాసం నాలుగో ఆదివారం కావడంతో పట్టణంలో దాదాపుగా అన్ని కులసంఘాల సభ్యులు ఉత్సాహంగా వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక అడబాల గార్డెన్స్‌లో కాపుల వనసమారాధన 19వ వార్షికోత్సవ కార్యక్రమం పండగ వాతావరణం నెలకొంది. సుమారు 15 వేల మంది కాపులు ఈ వనసమారాధనలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉన్న వంతెన నుండి అడబాల గార్డెన్స్ వరకూ రోడ్డుపై జనం కిటకిటలాడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు యడ్ల తాతాజీ, సినీ నిర్మాత బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..



మొగల్తూరు: విశ్వబ్రాహ్మణుల వన సమారాధనలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మొగల్తూరు: మండలానికి చెందిన విశ్వబ్రాహ్మణులు పుణ్య మాసం అయిన కార్తీక మాసంలో వన సమారాధన పేరిట అందరూ కలుసుకుని సహపంక్తి భోజనాలు చేయడం అభినందనీయమని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నక్కా చైతన్య శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మొగల్తూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన మండల విశ్వబ్రాహ్మణుల కార్తీక మాస వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధాని మోదీ విశ్వకర్మ పేరుతో 27 చేతి వృత్తుల వారికి సబ్సిడితో పరికరాలు అందించే కార్యక్రమం చేపట్టే కార్యక్రమం చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో కార్యదర్శి శివశ్రీ, మండల సంఘ అధ్యక్షుడు చింతోజ్ పాండురంగారావు, నాగుమళ్ళ శ్రీనివాస రావు, ఆముదాలపల్లి వీరబాబు, జవ్వాది నాగేశ్వరరావు, ప్రకాష్, గనిబోయిన బుజ్జి, పట్నాల చిట్టిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో

గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. స్థానిక శిష్టావారి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి బ్రాహ్మణ సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సామూహిక సత్యదేవుని వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసి ఉన్న స్వయంభూః శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి సన్నిధిలో కార్తీక మాసం త్రయోదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ఆలయములో సుమారు 600 మంది దంపతులు వ్రత పూజలు చేశారు. ఈ కార్యక్రమం దేవస్థానం వేదపండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ, అర్చకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదం, సత్యనారాయణస్వామి ప్రతిమలు, మండపారాధన వస్త్రాలను కృష్ణా జిల్లా తాడినాడ గ్రామానికి చెందిన దాత వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణరాజు (ఏడుకొండల రాజు) అందించారు. సత్యదేవుని వ్రతాలు సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐకమత్యానికి వనసమారాధనలు దోహదం

ఆకివీడు: ఐకమత్యానికి వనసమారాధనలు దోహదం చేస్తాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని కోసూరువారి వీధిలో ఆదివారం నిర్వహించిన గౌడ సంఘీయుల కార్తీక వనసమారాధన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలిసి మెలిసి జీవించేందుకు మన పూర్వీకులు ఇటువంటి సంప్రదాయాల్ని ఏర్పాటు చేశారన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలూ సమానమేనన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారని, వారికి కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు.

ప్రకటన

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,పాలకొల్లు వారు నాకిచ్చిన సమాచారం ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీమతి ముత్యాలపల్లి ప్రభావతి భర్త దేవుళ్ళు మార్టుగేజ్ చేయుటకు అంగీకరించారు. సదరు ఆస్తి పై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారంరోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. నరసాపురం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.3880/2021 నరసాపురం పట్టణానికి చెందిన ఆర్.యస్.నం.610/1లో 121 చ.గ స్థలానికి హద్దులు తూర్పు: ఉమ్మడి దారి మరియు ఎం.శ్రీనివాస్ స్థలం, పడమర: చవలవాడ ప్రభాకర్ స్థలం, ఉత్తరం: యాదంరెడ్డి శేషగిరి రావు గోడ దక్షిణం: బుంగా రత్నకుమారి భవనం

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక

దశల వారీగా రోడ్లు నిర్మించాలని నిర్ణయం



31వ వార్డు చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కాలనీలో సగం పూర్తిచేసి వదిలేసిన రోడ్డు

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్‌ముదునూరి ప్రసాదరాజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలోనూ, అలాగే చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ వార్డు పర్యటనల నేపథ్యంలో అంతర్గత రహదారుల సమస్యను గుర్తించారు. దీంతో ఎక్కడెక్కడ అంతర్గత రోడ్లు నిర్మించాలనే అంశంపై నివేదిక ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న అంతర్గత రోడ్లు నిర్మాణం జరగబోతుందని పట్టణవాసులు హర్షం వ్యక్తంగా చేస్తున్నారు. గత పాలకవర్గాలు అంతర్గత రోడ్లు నిర్మాణం విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపాయి. ప్రధాన రహదారులు తప్పిస్తే, కాలనీల్లో అప్రోచ్‌రోడ్లను నిర్మించలేదు. ఫలితంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డుల్లో ప్రజలు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా గత పురపాలకులు పట్టించుకోలేదు. అప్రోచ్ రోడ్ల నిర్మించలేదు.

ప్రజలకు ఇబ్బందులు

పట్టణంలో చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కానీలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించారు. కానీ కాలనీ నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకోవడానికి అప్రోచ్ రోడ్లు లేవు. దీంతో మట్టి దిబ్బలను దాటుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి. ఎన్టీఆర్ కాలనీ, నందమూరు కాలనీ, వైఎస్సార్ నగర్, స్టేషన్ పేట, గ్రేస్ నగర్, పొన్నపల్లి ప్రాంతాల్లో ఇదే రకమైన ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. వర్షాల సమయాల్లో అయితే జనం నానా అవస్థలు పడుతున్నారు. దళితులు, పేదలు ఎక్కువగా ఉండే 27, 28 వార్డుల్లోనూ, మున్సిపాల్టీ మురికివాడలుగా గుర్తించిన అరుందతిపేట, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి. ఇలాంటి రహదారులను అన్నిటినీ దశల వారీగా నిర్మించాలని నిర్ణయించి మున్సిపాలిటీ ముందుకెళుతుంది.

అప్రోచ్ రోడ్లను నిర్మిస్తాం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టికి ఎక్కువగా అప్రోచ్ రోడ్లు సమస్య తీసుకొచ్చారు. అప్రోచ్‌రోడ్లు లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్లు 5 కిలో మీటర్లు వరకూ ఉంటాయి. అయితే ప్రస్తుతం వర్షాలు తగ్గాయి కబట్టి త్వరలో పనులు మొదలు పెట్టేలా చర్యలు చేపడతాం. అవసరమైతే జనరల్‌ఫండ్స్ ఖర్చు చేసి నిర్మాస్తాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్